క్లుప్తంగా

పాఠశాలలో మౌలిక వసతుల కల్పన



మాగనూర్: మండల పరిధిలోని పెగడబండ గ్రామ ప్రాథమిక పాఠశాలలో మౌళిక వసతుల కల్పనకోసం నివేదిక సిద్ధం చేస్తున్నామని పాఠశాల హెచ్ఎం నరేందర్ అన్నారు. గురువారం మండల పంచాయతీరాజ్ ఏఈ ధర్మరాజు పాఠశాలను పరిశీలించారు. ఈ మేరకు.. పాఠశాలకు కావాల్సిన మౌళిక వసతులపై నివేదికనురూపొందించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యావలంటీర్లు మహాదేవ్, నారాయణరెడ్డి, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం



కోస్గి: లయన్స్‌క్లబ్ కోస్గి శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్యశిబిరం విజయవంతమైంది. స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణలో గురువారం నిర్వహించిన ఈ శిబిరంలో వైద్యులు భాస్కర్‌గౌడ్ 50మందికి కంటి పరీక్షలు చేయగా వారిలో 30మందికి కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. వారిని పాలమూరు జిల్లా కేంద్రంలోని లయన్స్ రాంరెడ్డి కంటి ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేస్తామన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు బెజ్జు వెంకట్రాములు, కో శాధికారి కొటాల్ శంకర్, ప్రతినిధులు వెన్న శేఖర్, మహేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

బీజేపీ నేషనల్ ఆఫీస్ కో-ఆర్డినేటర్‌గా విజయ్

మరికల్: రాష్ట్ర బీజేపీ నేషనల్ ఆఫీసు కో -ఆర్డినేటర్‌గా అప్పంపల్లికి చెందిన విజయ్‌కుమార్ రెడ్డిని ఏకగ్రీవంగా గురువారం ఎన్నుకున్నారు. ఈ పదవీ తనకు ఇచ్చినందుకు బీజేపీ కమిటీకి ఆయన కృతజ్ఞతలు తెలుపుకున్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన పార్లమెంట్ అభ్యర్థులను గెలిపించుకునేందుకు తనవంతు కృషి చేస్తామన్నారు.

లయన్స్‌క్లబ్ సేవలను విస్తరిద్దాం



నారాయణపేట రూరల్: లయన్స్‌క్లబ్ సేవలను విస్తృతం చేద్దామని ఇండియన్ మెడికల్ అండ్ డ్రగ్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గందె ఉమాకాంత్ అన్నారు. పట్టణంలోని చిన్నపిల్లల ఆస్పత్రి వద్ద గురువారం ఉమాకాంత్ జన్మదినం సందర్భంగా ఆయన కుమారుడు ప్రముఖ వైద్యులు డాక్టర్ గందె కార్తిక్ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రికి వచ్చే పేదలకు ప్రతీరోజు దాతల సహకారంతో భోజనం అందించేందుకు కృషి చేద్దామని అన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వెంకటయ్య, కో షాధికారి రవికుమార్‌గౌడ్, శ్రీనివాస్, భీంచందర్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.


టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడులు



నారాయణపేట: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా గురువారం టాస్క్ ఫోర్స్ పోలీసులు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో దాడులు చేయగా రూ.33,080 విలువ గల 46.65 లీటర్ల మద్యం పట్టుబడింది. జాకీర్ హుస్సెన్ అనే వ్యక్తి నారాయణపేట నుంచి కొల్లంపల్లికి ఆటోలో అక్రమంగా మద్యం తరలిస్తుండగా పట్టుబడినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున అక్రమంగా మద్యం తరలిస్తున్న అతడిపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మరమ్మతులకు నోచుకుని రోడ్డు

మాగనూర్: మండలంలోని మాగనూర్ - ఉజ్జెల్లి ప్రధాన రోడ్డుపై సంగంబడ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ బ్యాక్‌వాటర్ నుంచి వ్యవసాయ పొలాలకు పంపింగ్‌కోసం అడ్డగోలుగా రోడ్డు తవ్వకాలతో గుంతలు ఏర్పడి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతోంది. రోడ్డుకు మరమ్మతులు చేయాలని ప్రయాణికులు అనేక సార్లు విన్నవించిన అధికారులు స్పందించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి త్వరగా రోడ్డు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.



నిలువ నీడ కరువు

- బస్సుల కోసం రోడ్లపైనే ప్రయాణికుల పడిగాపులు
- ఎండలో ఇబ్బందులు పడుతున్న వైనం
- పట్టించుకుని అధికారులు, ప్రజాప్రతినిధులు



బస్సు కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

మాగనూర్: ఆర్టీసీ ప్రయాణికులకు నిలువ నీడ కరువవుతోంది. ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ రోడ్లపైనే వారు బస్సుల కోసం పడిగాపులు కాయాల్సి వస్తోంది. చాలా బస్టాప్‌లలో షెల్టర్లే లేవు. ఉన్నచోట నిర్వహణ అధ్వానంగా మారి శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రయాణికులు హోటళ్లు, రోడ్ల వద్ద బస్సులకోసం పడిగాపులు కాయాల్సి వస్తుందని ప్రయాణికులు వాపోతున్నారు. దంచికొడుతున్న ఎండలతో ప్రయాణికులు బస్టాండ్ లేక నానా వస్థలు పడుతున్నారు. రోడ్డు వెడల్పు కావడంతో బస్టాండ్ ఏర్పాటు చేస్తారని భావించిన మండల ప్రజలకు నిరాశ తప్పలేదు. కనీస అవసరాలు తీర్చుకునేందుకు కూడా ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు.

ఒక పంచాయతీలోనే బస్టాండ్..

మండలంలోని మొత్తం 16 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో కొత్తపల్లిలో తప్ప ఇతర గ్రామాల్లో బస్‌షెల్టర్ లేవు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు చెట్లు, హోటళ్లనే బస్టాండ్‌లుగా మార్చుకుంటున్నారు. మండల కేంద్రానికి నిత్యం వివిధ పనుల నిమిత్తం ఉద్యోగులు, రైతులు, విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. కాని బస్టాండ్ నిర్మించకపోవడంతో తాగునీటిసౌకర్యం, మూత్రశాలలు, మరుగుదొడ్లు వంటి కనీససౌకర్యాలు ప్రజలకు దూరమయ్యాయి. హోటళ్లలను ఆశ్రయంగా చేసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. హైదారాబాద్, మహబూబ్‌నగర్ డిపోల నుంచి నిత్యం మండల కేంద్రం మీదుగా కర్ణాటకలోని రాయిచూర్‌కు నిత్యం పదులసంఖ్యలో బస్సులు నడుస్తుంటాయి. అయితే మండలం నుంచి గ్రామాలకు వెళ్లే బస్సులకోసం కాని పట్టణాలకు కాని ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మహిళల అవస్థలు..

మండల కేంద్రానికి వచ్చే ప్రయాణికులు కనీస అవసరాలు తీర్చుకునేందుకు ఇబ్బంది పడుతున్నారు. మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడంతో మహిళలు ఇక్కట్లకు గురువుతున్నారు. దీంతో మండల కేంద్రానికి రావాలంటే ప్రయాణికులు జంకుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్‌షెల్టర్ నిర్మాణంతోపాటు ఇతర సౌకర్యాల కల్పనకు కృషిచేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

బస్టాండ్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి



వివిధ పనుల నిమిత్తం ప్రజలు మండల కేంద్రానికి వస్తుంటారు. కాని ఇక్కడ బస్టాండ్, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి బస్టాండ్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

- అశోక్‌గౌడ్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి

ప్రయాణికుల ఇబ్బందులు తీర్చాలి



మండల కేంద్రంలో ఎన్నో ఏళ్లు గడుస్తున్న బస్టాండ్ నిర్మాణానికి నోచుకోవడం లేదు. ముఖ్యంగా వేసవి కాలంలో ప్రయాణి కుల ఇబ్బందులు ఎక్కువ అవుతున్నాయి. అధికారులు స్పందించి ఇబ్బందులు తీర్చాలి.

- రమేష్, బీఎస్పీ మండల అధ్యక్షుడు

స్థలం కేటాయిస్తే నిర్మాణం చేపడుతాం..



మండలంలో బస్టాండ్ లేదని విషయం తమ దృష్టికి వచ్చింది. అయితే బస్టాండ్ నిర్మించాలంటే ప్రధానంగా స్థలం కావాలి. అయితే మాగనూర్‌లో బస్టాండ్ నిర్మాణానికి స్థలం కొరత ఉంది. గ్రామ పంచాయతీ వారు స్థలం చూయిస్తే బస్టాండ్ నిర్మాణం ప్రారంభిస్తాం.

- లక్ష్మీసుధా, డిపో మేనేజర్ నారాయణపేట

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వనజ

మక్తల్: వేసవి దృష్ట్యా ప్రతి గ్రామంలో తాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని ఎంపీపీ వనజ అన్నారు. గురువారం మండల సర్వసభ్య సమావేశం ఆమె అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ అధికారులు నివేదికను చదివే సమయంలో అధికారులు ఎవరూ రాకపోవడంతో కిందిస్థాయి అధికారులను పంపిస్తే పనులు ఎవరు చేయరని ఎంపీటీసీ బాల్‌రాంరెడ్డి, ఆశిరెడ్డి చెప్పారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలు దాదాపు నెలల తరబడి పేరుకున్నాయని, వాటికి పరిష్కారం చూపకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఉపాధి హామీ అధికారులు నివేదికను గ్రామాల్లో చేసిన పనులను చదివి వినిపించారు. ఉపాధి కూలీలకు రూ.272 నుంచి రూ.300 వరకు కూలీ పెంచామని చెప్పారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి కొరత లేకుండా చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. నర్సరీలో పనిచేస్తున్న వారికి కూలీ డబ్బులు రాలేదని పలువురు ఆరోపించారు. ఉపాధి హామీలో అధికారి విధులకు హాజరైనప్పటి నుంచి అవినీతి అధికంగా జరుగుతుందన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు త్వరగా వేయాలని కోరారు. ఐసీడీఎస్, పంచాయతీరాజ్, పశుసంవర్ధక, వ్యవసాయ, నీటిపారుదల, వైద్య, ఆరోగ్య తదితర శాఖలపై చర్చించారు. ముఖ్యంగా ఉపాధి హామీ పథకం, పంచాయతీరాజ్ శాఖపై చర్చించారు. తమ గ్రామాలకు రోడ్లు వేయాలని.. గ్రామాల్లో అందరూ కలిసికట్టుగా ఉండి పని చేసుకోవాలని కోరారు. గ్రామాల్లో సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీఓ గోవిందరెడ్డి, తహసీల్దార్ సువర్ణరాజు, వైస్ ఎంపీపీ రామేశ్వరి, ఎంపీటీసీ సభ్యుడు రంగప్ప, పద్మ, ఇందిరమ్మ, ఏఓ మిథున్ చక్రవర్తి, ఎంపీఓ రహేమత్, సీడీపీఓ సరోజిని మట్ట, సూపర్‌వైజర్లు రాజేశ్వరి, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు వాటర్ ఫిల్టర్ల అందజేత



మద్దూర్ పాఠశాలకు వాటర్ ఫిల్టర్ అందజేస్తున్న సంస్థ కన్వీనర్

మద్దూర్: మండల పరిధిలోని లక్క్యాయపల్లి ప్రాథమిక పాఠశాలను ఉత్తమ పాఠశాలగా ఎంపిక చేసిన శిక్షణ ఫౌండేషన్ వారు పాఠశాలకు వాటర్ ఫిల్టర్ అందజేశారు. ఈ మేరకు గురువారం పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఫౌండేషన్ మండల కన్వీనర్ నరేందర్ పాఠశాలకు వాటర్ ఫిల్టర్ అందజేశారు. తమ సంస్థ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన పాఠశాలలకు విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించుటకు శిక్షణ పుస్తకాలు అందజేసి ప్రతి నెల పర్యవేక్షిస్తామన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం వంశీధర్‌గౌడ్, హెచ్ఎం శ్రీనివాస్‌తో పాటు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



మరికల్‌లో వాటర్ ఫిల్టర్ అందజేస్తున్న శిక్షణ ఫౌండేషన్ సభ్యులు

మరికల్: మండలంలోని కన్మనూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు ప్రేరణ ఎఫ్ఎల్ఎన్ శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం వాటర్ ఫిల్టర్‌ను అందజేశారు. కాంప్లెక్స్ హెచ్ఎం లక్ష్మి మాట్లాడుతూ.. ఎఫ్ఎల్ఎన్ శిక్షణ ద్వారా 1నుంచి 5వ తరగతి విద్యార్థులు తెలుగు, గణితం, ఇంగ్లిష్ లో కనీస సామర్థ్యాలను సాధించినందుకు ఉత్తమ పాఠశాల బహుమతి కింద శిక్షణ ఫౌండేషన్ ద్వారా పాఠశాలకు వాటర్ ఫిల్టర్ అందజేశామన్నారు. కార్యక్రమంలో బ్లాక్ మెంటర్ శాంత, హెచ్ఎం సదాన్‌రావు, శిక్షణ ఫౌండేషన్ బృందం తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్‌లో ఇఫ్తార్

ఆత్మకూర్: ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలకు గురువారం రాత్రి స్థానిక నేతాజినగర్‌లోని కొండాపురం కురుమూర్తి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మౌలాన ముక్తదీర్ ప్రపంచశాంతి కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలాగే మస్జిదే సయ్యదియాలో ఖతాల్‌వలీ దర్గాకమిటి ఆధ్వర్యంలో ఇఫ్తార్‌విందును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సిద్దు, చిన్న, ఉక్బాల్, ఖమర్, మక్బూల్, ఫయాజ్, భట్టి పాష తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సభను విజయవంతం చేయండి



కోస్గిలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కోస్గి/మద్దూర్: ఈ నెల 6న హైదరాబాద్‌లో తుక్కుగూడలో నిర్వహించే కాంగ్రెస్ బహిరంగ సభను పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మండల నాయకులు సూచించారు. ఈ మేరకు గురువారం ఆయా మండల కేంద్రాల్లో వేర్వేరుగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. బహిరంగకు పార్టీ జాతీయ నాయకులు హాజరై జాతీయ గ్యారెంటీలను ప్రకటిస్తారని నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలతోపాటు హాజరు కావాలని సూచించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు వార్ల విజయ్‌కుమార్, కోస్గి, గుండుమాల్ మండలాల అధ్యక్షులు రఘువర్ధన్‌రెడ్డి, విక్రంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు తుడుం శ్రీనివాస్, కౌన్సిలర్లు గోవర్ధన్‌రెడ్డి, నాయకులు సురేష్‌రెడ్డి, హరి, గిరి ప్రసాద్ రెడ్డి, దోమ రాజేశ్వర్, సలీం, టెంట్ నర్సింహ, రాస్నం బాల్‌రాజ్, సుధాకర్‌గౌడ్, వెంకటేష్, సంజీవ్ కుమార్, సతీష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు మైక్‌సెట్ వితరణ



నారాయణపేట రూరల్: మండలంలోని జాజాపూర్ జెడ్పీహైస్కూల్‌లో 2013-14 విద్యా సంవత్సరంలో టెన్త్ చదువుకున్న పూర్వ విద్యార్థులు సొంతంగా డబ్బులు జమచేసి మైక్‌సెట్ కొనుగోలు చేశారు. గురువారం పాఠశాల ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పేద విద్యార్థుల అభ్యున్నతికి తోడ్పాటు నందించాలని కోరారు. కార్యక్రమంలో డీఎస్ఓ భానుప్రకాష్, ఉపాధ్యాయులు మాధవి, శోభారాణి, మధుసూదన్‌రావు, లక్ష్మణ్, శిరీష, నిర్మల, సురేఖ, కృష్ణవేణి, మాణిక్యప్ప పాల్గొన్నారు.

నాగుసాన్‌పల్లిలో తాగునీటి ఎద్దడి

కోస్గి: మున్సిపల్ పరిధిలోని నాగుసాన్‌పల్లిలో మూడురోజులుగా తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామని, బోరు మోటర్ మరమ్మతు చేయాలని అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామానికి తాగునీరు అందించే బోరు మోటర్‌కు సంబంధించిన స్టాటర్ చెడిపోయి మూడు రోజులవుతుందన్నారు. ఈ విషయంలో మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. ఇప్పటికై నా గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఈద్గాను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక న్యూగంజ్ (వానగట్టు) సమీపంలోని ఈద్గా వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలని ఈద్గా కమిటీ సభ్యులు గురువారం మహబూబ్‌నగర్ మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డిని కలిసి విన్నవించారు. అనంతరం అక్కడికి ఆయన వెళ్లి పరిశీలించారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని అక్కడ మున్సిపల్ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన పనులపై ఇంజినీరింగ్ విభాగం అధికారులతో కలిసి చర్చించారు. ముఖ్యంగా తాగునీటి సౌకర్యంతో పాటు షామియానాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే ఈద్గా స్థలాన్ని చదును చేయాలని, పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. అనంతరం తెలంగాణచౌరస్తాలోని బాబూ జగ్జీవన్‌రాం విగ్రహం వద్ద విద్యుద్దీకరణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ ఈడీ పాండు, మున్సిపల్ డిప్యూటీ ఈఈ బెంజిమన్, ఏఈ సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

ఈద్గా వద్ద అన్ని ఏర్పాట్లు

రంజాన్ పండగను పురస్కరించుకుని స్థానిక న్యూగంజ్ (వానగట్టు) సమీపంలోని ఈద్గా వద్ద అన్ని ఏర్పాట్లు చేస్తామని మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. గురువారం అక్కడి స్థలాన్ని పరిశీలించారు. అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. వైస్‌చైర్మన్ షబ్బీర్‌అహ్మద్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రి, ఈద్గా కమిటీ చైర్మన్ తకీ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు షిర్డీసాయి భవజన మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు.

కాంగ్రెస్‌ను భూస్థాపితం చేస్తాం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: రాష్ట్రంలో ఎస్సీలకు ఎంపీ స్థానాల్లో మూడు రిజర్వు అయినప్పటికీ మాదిగలకు ఒక్కటైనా కాంగ్రెస్ కేటాయించకపోవడం తగదని ఎంఎస్ఎఫ్ పీయూ అధ్యక్షుడు మీసాల గణేష్ అన్నారు. ఆ పార్టీ వైఖరికి నిరసనగా గురువారం సంఘం ఆధ్వర్యంలో పాలమూరు యూనివర్సిటీ మెయిన్ గేట్ వద్ద బైఠాయించి కొద్దిసేపు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని భూస్థాపితం చేస్తామన్నారు. మాలలకు భయపడి సీఎం పదవిని కాపాడుకోవడానికి రేవంత్‌రెడ్డి తమకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఉపాధ్యక్షుడు శ్రీను, కార్యదర్శులు బాలకృష్ణ, కృష్ణమోహన్, నాయకురాళ్లు శ్రావణి, కనకమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ అధికారులు పనితీరు మార్చుకోవాలి



మండల సమావేశంలో నిలదీస్తున్న ఎంపీటీసీ

ఊట్కూరు: ఐసీడీఎస్ అధికారులు పనితీరు మార్చుకోవాలని ఎంపీపీ ఎల్కోటి లక్ష్మీనారాయణరెడ్డి అన్నారు. గురువారం మండల పరిషత్ భవనంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ మేరకు వివిధ శాఖలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలోని అంగన్వాడీ కేంద్రాలకు వచ్చిన సరుకుల వివరాలను ఆయా గ్రామాల్లో ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వడం లేదని ఎంపీటీసీ హన్మంతు ఆరోపించారు. దీంతో ఎంపీపీ ఎల్కోటి లక్ష్మీనారాయణరెడ్డి జోక్యం చేసుకొని ఇదే విషయమై పలుమార్లు సర్వసభ్య సమావేశంలో చర్చించిన ఐసీడీఎస్ సూర్‌వైజర్లు పనితీరును ఎందుకు మార్చుకోవడంలేదని సూపర్‌వైజర్ గీతను నిలదీశారు. ప్రజాప్రతినిధుల గ్రూపును ఏర్పాటు చేసి ఫోన్ ద్వారా సమాచారమందించాలని సూచించారు. పనులపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఎంపీపీ అన్నారు. మండలానికి కొత్తగా బదిలీపై వచ్చిన అధికారులు ప్రజాప్రతినిధులను పరిచయం చేసుకోవడం లేదని జెడ్పీటీసీ అశోక్‌కుమార్ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. దీంతో కొత్తగా వచ్చిన అధికారులు సమావేశంలో నిలబడి తమనుతాము పరిచయం చేసుకున్నారు. మండలంలో బాలుర ఉన్నత పాఠశాలలో మనఊరు - మనబడిలో కోటి రూపాయలు మంజూరైన ఇప్పటివరకు కాంట్రాక్టర్ పనులను ప్రారంభించలేదని ఎంపీటీసీ హన్మంతు ఆరోపించారు. ఉత్తర్వులు వచ్చిన వెంటనే పనులను ప్రారంభిస్తామని ఎంఈఓ వెంకటయ్య తెలిపారు. ఉపాధి హామీ పనులు మండలంలో సరిగ్గా కొనసాగడం లేదని జెడ్పీటీసీ అశోక్‌కుమార్‌గౌడ్, ఏపీఓ సత్యప్రకాష్‌కు పనులు సరిగ్గా జరగడంలేదని సూచించారు. సమావేశానికి ఫీల్డ్ అసిస్టెంట్ ఎందుకు రాలేదని ఏపీఓను ప్రశ్నించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు అవతవకలకు పాల్పడితే ఉన్నతాధికారుల దగ్గరికి తీసుకెళ్తామని జెడ్పీటీసీ తెలిపారు. ఆస్పత్రి అభివృద్ధి సమావేశాలు నెలలు గడిచిన నిర్వహించడంలేదని పలువురు సభ్యులు సమావేశంలో ఆరోపించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమావేశాలు నిర్వహిస్తామని ఎంపీపీ తెలిపారు. జెడ్పీటీసీ అశోక్‌కుమార్‌గౌడ్, ఎండీపీఓ ధనుంజయ్యగౌడ్, ఎంపీటీసీ హన్మంతు, వైస్ ఎంపీపీ ఎల్లగౌడ్, రవిప్రసాద్‌రెడ్డి, ఎంఈఓ వెంకటయ్య, వ్యవసాయ అధికారి గణేష్ రెడ్డి, సమీనాబేగం తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి



జిలాల్‌పూర్‌లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

నారాయణపేట రూరల్: ప్రతి ఒక్కరూ తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని జిలాల్‌పూర్, బైరంకొండ, ఎక్లాస్‌పూర్ గ్రామాల్లో గురువారం టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాంతియుత వాతావరణంలో నిర్వహించడానికి ఎన్నికల సంఘం, పోలీసుశాఖ అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. ఎన్నికల విషయంలో ఎవరైన అవాంఛనీయ సంఘటనలకు పాల్పడే అవకాశం ఉన్నట్లు ఎవరి దృష్టికి వచ్చిన వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



మద్దూర్‌లో కూలీలతో మాట్లాడుతున్న గోపాల్

దామరగిద్ద: ఉపాధి కూలీల సమస్యలపై ఈ నెల 6న కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టనున్న ధర్నాకు కూలీలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్ అన్నారు. గురువారం మండలంలోని గడిమున్కన్‌పల్లిలో పనులు చేస్తున్న కూలీలను కలిసి సమస్యను అడిగి తెలుసుకున్నారు. పని ప్రదేశాల్లో టెంట్లు, తాగునీరు, ప్రథమ చికిత్స కిట్‌లు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. మాజీ వైస్ ఎంపీపీ మహేష్‌కుమార్‌గౌడ్, వ్యవసాయ కార్మికసంఘం మండల కార్యదర్శి శివకుమార్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి హన్మంతు, కూలీలు సిలరప్ప, బాలప్ప, సర్సప్ప, సవంత, లింగం, సావిత్ర, మొగులప్ప పాల్గొన్నారు.

ఊట్కూరు: ఉపాధి కూలీలకు వారంవారం డబ్బులు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటరామారెడ్డి అన్నారు. గురువారం పగిడిమారి గ్రామ శివారులో ఉపాధి కూలీలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. ఉపాధి పనులకు తల్లులు చిన్నపిల్లలను తీసుకొస్తున్నారని, ఎండలు అధికంగా ఉన్నందున పనిస్థలం వద్ద టెంట్‌లను ఏర్పాటు చేయాలని కూలీలకు తాగునీటి వసతిని కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బలరాం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం. బాలప్ప పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

మద్దూర్: మండల పరిధిలోని ఎక్కమేడ్‌లో కొనసాగుతున్న ఉపాధిహామీ పనులను గురువారం మండల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ మేరకు ఎంపీడీఓ జయరాములు, ఏపీఓ సిద్దేశ్వర్ పనులు జరుగుతున్న ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. నిబంధనల మేరకు పనులు చేపట్టాలని సూచించారు. హాజరైన కూలీల వివరాలు, పనుల నమోదు, ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇందులో పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు ఉన్నారు.



ముదుమాల్‌లో..

కృష్ణా: మండలంలోని ముదుమాల్‌లో కొనసాగుతున్న ఉపాధిహామీ పూడికతీత పనులను గురువారం ఎంపీడీఓ జానయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులకు హాజరయ్యే కూలీల పేర్లతోపాటు చేస్తున్న పనులను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. అదేవిధంగా గుడెబల్లూర్‌లో మరమ్మతులో ఉన్న తాగునీటి బోర్లను రిపేర్ చేయించినట్లు తెలిపారు. ఆయనతోపాటు టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు ఉన్నారు.

రోడ్డు ఇలా.. ప్రయాణించేదెలా?



అడవిసత్యారం సమీపంలో రోడ్డుపై కమ్మేసిన కంపచెట్లు

మాగనూర్: మండలంలోని వడ్వాట్ - అడవిసత్యారం గ్రామాలకు వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారడంతోపాటు కంపచెట్లతో కమ్మేసి అధ్వానంగా తయారయ్యాయి. దీంతో ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు ఇరువైపుల కంపచెట్లు పెరిగిపోయి రోడ్డును పూర్తిగా కమ్మేశాయి. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు అతి సమీపంలోకి వచ్చేవరకు కనిపించకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అమ్మపల్లిగేట్ నుంచి కొల్పూర్ వరకు కంపచెట్లు కమ్మేయడంతో రోడ్డు మలుపు వద్ద వాహనదారులు ఎదురెదురుగా వచ్చి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. కంపచెట్లను తొలగించడంతోపాటు రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.